# హంసలను వేటాడొద్దు [8]

మూలం: బోరిస్ వాసిల్యెవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [8]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం : మే 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=2586

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [8]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** కోల్కా టీచరు నోనా యురీవ్నా లెనిన్ గ్రాడ్ నుంచి ఈ మారుమూల ప్రాంతానికి ఉద్యోగానికి వచ్చి ఒంటరిగా ఉంటుంది. తండ్రి కొట్టాడన్న కోపంతో ఇంటికి వెళ్లని కోల్కా  ఆమె దగ్గరే ఉంటాడు. తండ్రి తనను కొట్టాడన్న దాని కన్నా, వేరే వాళ్ల మాటలకు బలహీనంగా రెచ్చిపోయి కొట్టాడన్నది అతణ్ని ఎక్కువ బాధకు గురిచేస్తుంది. టీచరూ, కోల్కా ఇద్దరూ కలిసి కాసేపు సంగీతం వింటారు. అక్కణ్ణించి కోల్కా రేవుల కేంద్రానికి వెళ్లి అధికారి యకోవ్ ప్రోకోవిచ్ కు ఆ రోజు యాత్రికులతో వెళ్లినపుడు జరిగిన సంఘటనలు, పడవ ఎందుకు మునిగిపోయిందీ, అందులో తన తండ్రి తప్పేమీ లేదన్న సంగతీ చెప్తాడు. యకోవ్ ప్రోకోవిచ్ సానుభూతి చూపించదు. తిరిగి టీచరు దగ్గరికి వెళ్లి మనుషులు ఇతరుల పట్ల దయ లేకుండా ఇలా ఎందుకు ఉంటారని అడుగుతాడు. ఎదగని అంతరాత్మే దానికి కారణమంటుంది ఆమె. ఎదగని అంతరాత్మల కోసమే మనిషి నియమాలు ఏర్పరుచుకుంటాడంటుంది. కోల్కా తన తండ్రికున్న సులువైన నియమాల గురించి ఆలోచిస్తాడు. **ఇక చదవండి:—**

## 8

జిల్లా కేంద్రానికి రైలు చాలా త్వరగా చేరుకుంది. దాంతో తెల్లవారుజాము అయిదు గంటలకల్లా యెగార్ మార్కెట్లో ఉన్నాడు. మార్కెట్టు ఇంకా తెరవలేదు, యెగార్ గేట్ల పక్కన నిలబడి, సంచులు కిందకి దించాడు. దగ్గరగా ఉన్న స్తంభానికి భుజం చేర్చి నిలబడి, నాస్తాకి బదులు చుట్ట చుట్టుకుంటూ చెయ్యబోయే వ్యాపార లావాదేవీ గురించి భయంభయంగా ఆలోచించసాగాడు. అతడిలో వ్యాపారి స్వభావం లేదు – అతడి చేతులు గొడ్డలి కోసం తయారుచేయబడ్డాయి, తక్కెడ, తూకంరాళ్ల కోసం కాదు. ఇంటి దగ్గర ఆ ఆవేశంలో తన సామర్థ్యాలను ఎక్కువగా అంచనా వేసుకున్నాడు. ఇప్పుడు నిరుత్సాహంతో నేల చూపులు చూస్తూ, నిట్టూరుస్తూ ఆ నిర్ణయానికి విచారించసాగాడు.

ఒక విషయాన్ని మనం ఒప్పుకోవాలి: యెగార్‌కి మార్కెట్టు అంటే భయం. అదంటే అతడికి భయమే కాదు, అపనమ్మకం కూడా. చివరికి ఎలాగైనా తనని మోసం చేస్తారని అతడి నమ్మకం.

ఎక్కడో ఒక చోట అతడిని బోల్తా కొట్టిస్తారని తెలుసు, అయితే మొత్తంగా మోసానికి గురికాకుండా ఉంటే చాలని ఆశించసాగాడు. తన నెత్తి మీద తుఫానులా ముసురుకున్న ఆ మూడు వందల రూబుళ్లు ఏ విధంగానైనా తొలగిపోతే చాలని అనుకోసాగాడు.

ఈలోగా పట్టణం మేలుకోసాగింది: కార్ల మోతలు వినపడసాగాయి, బజార్లు ఊడ్చేవాళ్లు మెల్లగా పనిలోకి దిగుతున్నారు, పొద్దున్నే పనుల్లోకి వెళ్లే ఆడవాళ్లు తమ ఎత్తు మడాలు టకటకలాడిస్తూ వెళుతున్నారు. ఎందుకైనా మంచిదని యెగార్ సౌకర్యంగా ఉన్న దూరపు స్తంభాన్ని ఒదిలి అంత సౌకర్యంగా లేని స్తంభానికి చేరి తన సంచులకు దగ్గరగా వచ్చాడు. అయితే మార్కెట్టులో ఇంకే కలకలమూ మొదలుకాలేదు. కొంత మంది మనుషులు వచ్చారు కానీ, యెగార్ ఎంచుకున్న గేట్లను ఇంకా ఎవరూ తెరవలేదు.

"అది ఏమిటి?"

యెగార్ వెనక్కి తిరిగాడు: కళ్లద్దాలు, టోపీ పెట్టుకుని చేతిలో బ్రీఫ్‌కేసుతో ఒక అధికారి. అతడి వేలు సంచుల వైపు చూపిస్తోంది.

"అది ఏమిటని అడిగాను."

"ఏముంది, పంది మాంసం," యెగార్ కంగారుగా జవాబిచ్చాడు. "తాజా పంది మాంసం. దానిని నేనే చంపాను."

"నువ్వే చంపావా, ఆఁ?" టోపీ కింద అతడి కనుబొమ్మలు యాంత్రికంగా పైకి, కిందకి కదిలాయి. "అది రక్తం! అపరిశుభ్ర రక్తం కాలవగట్టింది – నా కంటికే అది స్పష్టంగా కనపడుతోంది."

సంచులలోంచి పసుపు వన్నె ధార కారుతున్న విషయం నిజమే. యెగార్ ఏమీ అర్థం కాక దాని వంక, కఠినంగా అనిపిస్తున్న ఆ అధికారి వంక రెప్పలల్లారుస్తూ మార్చి మార్చి చూడసాగాడు.

"ఇట్లాంటి మోసాలు చేస్తే బజారులో సరుకులు అమ్మనివ్వరు," బ్రీఫ్‌కేసుతో ఉన్న అధికారి తీవ్రంగా అన్నాడు. "అవి ఏం సరుకులు అన్నావు?"

"నేనా? నా దగ్గర సరుకులు ఏమీ లేవు. తాజా మాంసం ఉంది. పంది మాంసం."

"అయితే నియమాలను మరింత ఖచ్చితంగా పాటించాలి. ఎప్పుడైనా కలరా గురించి విన్నావా? లేదు? ఆరోగ్యానికి పరిశుభ్రత రాచబాట! నీ పేరు?"

"నా పేరా?"

"నేను అడిగింది నీ పేరే."

"నా పేరు... పొలుష్కిన్."

"పొ–లుష్కిన్." టోపీ పెట్టుకున్న పెద్దమనిషి ఒక నోటు పుస్తకం బయటకు తీసి, యెగార్ పూర్తి పేరు జాగ్రత్తగా రానుకున్నాడు. దాంతో యెగార్ కలవరానికి లోనయ్యాడు. "నీ విలువను తగ్గించేస్తాం. ఎందుకో నీకు తెలుసు. ఏం చెయ్యాలో నువ్వే నిర్ణయించుకో."

ఆ అధికారి నోటు పుస్తకాన్ని జేబులో పెట్టుకుని వెనక్కి చూడకుండా వెళ్లిపోయాడు. యెగార్ ఆశ్చర్యంతో కళ్లు రెపరెపలాడిస్తూ అతనివంక చూస్తూ ఉండిపోయాడు. ఆ తరువాత అంతా పరిశుభ్రంగా ఉండాలని సంచులు తీసుకోబోయాడు – అయితే అతడికి అందుకు అవకాశం లేకపోయింది. మార్కెట్టులోంచి ఇద్దరు వ్యక్తులు మెల్లగా కాళ్లీడ్చుకుంటూ వస్తున్నారు: ఒకడు కొంచెం ముసలివాడు, ఒకడు మధ్య వయస్సు వాడు. ముసలివాడు నిట్టూర్చి, చప్పరిస్తూ, "రక్తం పీల్చే జలగ!" అన్నాడు.

"ఆఁ?" అన్నాడు యెగార్.

"అతడెవరో తెలుసా?" అడిగాడు మధ్య వయస్సు వాడు. "తనిఖీ అధిపతి. మాంసానికి ముద్ర వేస్తాడు."

"ముద్రా?"

"ముద్ర లేకపోతే అమ్మటానికి లేదు. నిన్ను అమ్ముకోనివ్వరు, నీకు రిఫ్రిజిరేటరు ఇవ్వరు. దాంతో మాంసమంతా కుళ్లిపోతుంది."

"ఆఁ?" అన్నాడు యెగార్.

"అందరూ గట్టిపిండాలు – చాలా దారుణం!" నిట్టూర్చాడు ముసలివాడు. "గట్టిపిండాలు, అతి జాగ్రత్తపరులు: అంటురోగాల గురించి విన్నావా?"

"ఆఁ?"

"చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు..."

ఆ ఇద్దరు మనుషులు నిట్టూర్చారు, విచారం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం, తనిఖీ, అంటురోగాలు, వర్గీకరణలు, ముద్రలు, రిఫ్రిజిరేటర్లు అంటూ ఏదేదో మాట్లాడసాగారు. ఒకడు ఎడమవైపు ఉన్నాడు, ఒకడు కుడి వైపున ఉన్నాడు. వాళ్లిద్దరూ మాట్లాడుకుంటూ ఉంటే యెగార్ వినటానికి తల అటూ, ఇటూ తిప్పుతుండేసరికి మెడ పట్టేసినంత పని అయ్యింది.

"నీ పని అయిపోయింది, మిత్రమా."

మధ్య వయస్సు వాడిని చూపిస్తూ ముసలివాడు, "పోయిన నెల అతడు మూడు వందల రూబుళ్లు నష్టపోయాడు," అన్నాడు.

"ఆఁ?"

"టాటా, మూడు వందలు. ఆ పిట్టలు ఎగిరిపోయినట్టు ఎగిరిపోయాయి."

"ఆఁ?"

"అవును, అది విషాద సత్యం… నీ దగ్గర ఉన్నదేమిటి, గొడ్డుమాంసమా?"

"పంది మాంసం," యెగార్ నోరు తెరుచుకని, ఇద్దరినీ మార్చి మార్చి చూడసాగాడు. "నేను ఏం చెయ్యాలి మిత్రులారా? నాకు సలహా ఇవ్వండి."

"సలహా ఇవ్వటానికి ఏముంది? నీ సంచులు తీసుకుని ఇంటికి వెళ్లు. మీ ఉమ్మడి వ్యవసాయ క్షేత్రంలో కిలోకి రూబులు లెక్కన అమ్మవచ్చు."

"ఒక రూబులుకా?"

"ఒక రూబులుకి కూడా తీసుకోరు," అన్నాడు మధ్య వయస్సు వాడు.

"రూబులుకి ఎందుకు కొంటారు? మహా అయితే డెబ్బై కొపెక్కులు ఇస్తారు."

"డెబ్బై కొపెక్కులా? డెబ్బై కొపెక్కులికి చచ్చినా అమ్మలేను. నాకు మూడువందల రూబుళ్ల అప్పు ఉంది."

"అయ్యో, చాలా కష్టాల్లో ఉన్నావు," నిట్టూర్చాడు ముసలివాడు. "మేమంతా సిగ్గుపడాల్సిన విషయం. కానీ అతడు నీ పేరు రాసుకున్నాడంటే ఎవ్వరం ఏమీ చెయ్యలేం."

"అ-లాగా?"

“అతడికి సాయపడకూడదూ?” యెగార్ తరఫున బతిమాలాడాడు మధ్య వయస్సు వాడు. “అతడు అప్పుల్లో ఉన్నాడు, అతడు తెచ్చిన పందిమాంసమేమో కుళ్లిపోతోంది.”

“కష్టం,” ముసలివాడు విచారం వ్యక్తం చేశాడు. “కష్టమంటే ఇట్లాంటి అట్లాంటి కష్టం కాదు మళ్లీ!”

“నేను అర్థం చేసుకోగలను!” యెగార్ చుట్టూ పరికించి చూస్తూ గుసగుసగా అన్నాడు. “అదీ... ఏమంటారు... నీ కష్టాన్ని మరిచిపోను. ఏదో ఒక రకంగా నీ రుణం తీర్చుకుంటాను.”

“అది అనవసరం,” ముసలివాడు కఠినంగా పలికాడు. “నీ కష్టాలకు నా గుండె స్పందిస్తుంటే నువ్వు డబ్బుల గురించి మాట్లాడుతున్నావు. ఇది అవమానకరంగా ఉంది.”

“అవమానమే,” మధ్య వయస్సు వాడు ఏకీభవించాడు.

“అయ్యో, నా ఉద్దేశం అది కాదు!” యెగార్ ఆందోళనతో వివరించబోయాడు. “నేను... మీకు తెలుసుగా... ఏదో నోటికి వచ్చింది అనేసాను – నిజంగా!”

“ఏదో అనేసాడు,” అన్నాడు మధ్య వయస్సు వాడు. “అతడిని ఏదో ఒక రకంగా బయటపడెయ్యకూడదూ?”

“అధికారులనుంచి తప్పించుకోవటం ఎలా అన్నది ముఖ్యమైన విషయం,” వివరించాడు ముసలివాడు. “వాళ్లకి నీ పేరు తెలుసు: దానిని రాసుకున్నారు. అన్నిటికంటే తిరకాసైన విషయం అదే. అంతా ఒక్కసారిగా అమ్మెయ్యటం మంచిదేమో, ఏమంటావ్? గంపగుత్తగా. టోకుగా అంటారు: కిలోకి రూబులున్నర.”

“రూబులున్నరా?!” యెగార్ నిర్ఘాంతపోయాడు. “ప్రియ మిత్రులారా, నిజంగా అంటున్నారా! ఇది దొంగల దోపిడీ లాగా ఉంది.”

“దొంగల దోపిడీ అని అంటున్నావా? మరి నీ పేరు రాసుకుని వెళ్లారన్నదానిని ఏమంటావు? ఇదంతా నీ తప్పు – ఇక్కడంతా అపరిశుభ్రతను వ్యాపింపచేస్తున్నావు – పైగా దొంగల దోపిడీ అంటావా! నీతో మాకేం పని అసలు? ఏదో స్నేహపూర్వకంగా సాయం చెయ్యబోతే ఎంత మాటనేశావు.”

“అమ్మితే అమ్ము, లేకపోతే లేదు,” అన్నాడు మధ్య వయస్సు వాడు. “అది నీ ఇష్టం.”

ఆ తరువాత వాళ్లిద్దరూ అక్కడినుంచి వెళ్లిపోయారు. యెగార్‌కి ఏమి చెయ్యాలో పాలుపోలేదు. కాసేపు ఆలోచించాడు, కాసేపు తటపటాయించాడు. ఇక ఊరకుండలేకపోయాడు. "ఓ అన్నలారా! అయ్యలారా!"

వాళ్లు ఆగారు. "రెండున్నర..."

"ఫో ఇక్కడినుంచి!"

అంటూ వాళ్లే వెళ్లిపోసాగారు. యెగార్ మరింత ఆందోళనకు లోనయ్యాడు:

"అన్నలారా! దయగల పెద్దమనుషులారా, నన్ను వదిలి వెళ్లవద్దు!"

వాళ్లు మళ్లీ ఆగారు.

"ఏం కావాలి నీకు? నిన్ను మేం గౌరవిస్తున్నాం, ఏమీ ఆశించకుండా సహాయం చెయ్యాలనుకుంటున్నాం. నువ్వేమో ఏమీ నిర్ణయించుకోలేకపోతున్నావు."

"అసలు విషయం చెప్పాలంటే నువ్వు మాటమీద నిలబడే మనిషివి కాదు."

"ఎక్కడికి వెళుతున్నారు, మిత్రులారా? నా సంగతేం చేశారు?"

"నీ తిప్పలు నువ్వు పడు."

వాళ్లు మలుపు తిరిగి మార్కెట్టునుంచి వెళ్లిపోసాగారు. యెగార్ అరిచి, వాళ్లను పిలిచాడు, "ఆగండి! సరే, లాభం గురించి ఆలోచించి ప్రయోజనం ఏముంది. రెండు వందల ముప్పైకి మొత్తం గంపగుత్తగా తీసుకోండి."

వాళ్లు తనని మోసం చేస్తున్నారని అతడికి తెలుసు. మోసం చేసి దోచుకుంటున్నారు. ఆ ఆలోచనతోనే అతడి గుండె బరువెక్కింది. ఉన్నట్టుండి, ఇతరుల కష్టాలను సొమ్ము చేసుకునే ఫ్యొడార్ ఇపటొవిచ్, ఇతరుల కష్టాలు ఏమాత్రం పట్టని యకోవ్ ప్రొకొపిచ్, పర్యాటకులు, ఈ మోసగాళ్లు, ఇంకా ఇటువంటి స్వార్థ, లేకి, కుత్సిత మనుషులు గుర్తుకొచ్చారు. అదంతా కళ్లముందు ఒక్కసారి కదలాడినట్టయ్యి, "మొత్తం గంపగుత్తగా..."

"నీకు తెలియంది ఏముంది, ముందుగా ఒక అంచనా వేయాలి. నీ సరుకును త్రాసు మీద వెయ్యి."

వాళ్లు అంచనా వేశారు. యెగార్ రెండు వందలతో ఇంటికి వెళ్లాడు.

అయితే అతడి చేతిలో మాంసానికి బదులు బహుమతులు ఉన్నాయి. ఒకరి కోసం చిన్న చాకు, మరొకరి కోసం రుమాలు, ఎవ్వరినీ వదిలిపెట్టకుండా ప్రతి ఒక్కరికీ ఏదో ఒకటి తీసుకున్నాడు. చివరికి ఓడ్కా కూడా కొన్నాడు. ఇంట్లోకి అడుగుపెట్టగానే చెప్పాడు, "అతిథులను పిలువు, హారిటీనా. అందరినీ పిలువు: బృంద నాయకులు, ఫోర్‌మాన్, యకోవ్ ప్రొకొపిచ్, మన బంధువులు. యెగార్ పొలుష్కిన్ అందరికీ విందు ఇవ్వాలనుకుంటున్నాడు."

"నీ బుర్రలో ఏమేమి గొప్ప ఆలోచనలు తిరుగుతున్నాయి, నువ్వు ఏం చేద్దామనుకుంటున్నావు?"

హారిటీనాని అతడు పూర్తి చెయ్యనివ్వలేదు. బూట్లు కూడా విడవకుండా బల్ల దగ్గర కూర్చుని, పిడికిలితో గట్టిగా గుద్దాడు, "ఇక ఆపు! విషాదఛాయలు లేకుండా కనీసం ఒక్కరోజు గడుపుదాం!"

"నీ నెత్తిమీద మూడొందల అప్పు ఉంది. పందిని అమ్మగా వచ్చింది నీకు రెండు వందలు. ఇంకొక వంద ఎక్కడనుంచి తెస్తావు?"

"నేను ఈ కుటుంబానికి తలకాయలాంటివాడిని, నేను ఏదో ఆలోచన చేస్తాను."

"నువ్వు తలవైతే, నేను మెడను: కుటుంబ కాడి భారం నా మీదుంది..."

యెగార్ తన జేబులోంచి డబ్బులు బయటకు తీసి గాలిలో ఊపాడు.

"ఈ కాగితాల కోసం విచారిస్తావా? వీటితో ఏం చేస్తావు – వాటితో జీవితం అందాన్ని కొలుస్తావా? నీ కన్నీళ్లను తుడుస్తావా? ఒక పెద్ద మంటవేసి డబ్బులన్నింటినీ తగలబెట్టాలి – మనం చెయ్యాల్సిన పని అది! వాటిని కాల్చి, బూడిద మీద గంతులెయ్యాలి! మంట చుట్టూ నాట్యం చెయ్యాలి! చక్కగా చలి కాగవచ్చు, అంధులకు కాంతినివ్వవచ్చు! అవును – ఆ మంటల్లో నా చివరి రూబుళ్లను ముందుగా నేనే వేస్తాను –"

"యెగా-ర్!"

హారిటీనా అతడి కాళ్లమీద పడింది: చివరి రూబుళ్లను అతడు తగలబెట్టినా ఆశ్చర్యపోనవసరం లేదు. అతడు రూబుళ్లను తగలబెడితే, అధికారులు వచ్చి అతడిని తీసుకెళతారు. ఆ తరువాత అతడిని జైలులో వేస్తారు, లేదా ఉరితాడు కట్టి వేలాడదీస్తారు.

"మమ్మల్ని ముంచకు, యెగార్, పిల్లల జీవితం నాశనం చెయ్యకు. నువ్వు ఏంచెపితే అది చేస్తాను. అందరినీ విందుకి పిలుస్తాను. వంటలు చేస్తాను, రొట్టెలు కాలుస్తాను, తాగటానికి మద్యం

పోస్తాను. ముందు ఆ డబ్బులు నాకు ఇస్తే, వాటిని జాగ్రత్త చేస్తాను. దేవుడి పేరుమీద అడుగుతున్నాను, ఆ డబ్బులు నాకివ్వు.”

ఎవరో గాలి తీసేసినట్టు యెగార్ ఒక్కసారిగా నీరసించిపోయి, జారగిలబడిపోయాడు. మార్కెట్టు నుంచి తెచ్చిన నోట్లను కింద పడేసాడు, “ఓడ్కా దండిగా ఉండాలి. కావాలంటే, అందరూ దాంట్లో మునిగిపోయేటట్టు ఉండాలి.”

హారిటీనా తలూపి, ఎలకలాగా తలుపువైపుకి కదిలింది.

బల్ల దగ్గర కూర్చున్న యెగార్ తన పొగకు డబ్బా తీసి చుట్ట చుట్టుకోసాగాడు – అది అతడి ప్రియమైన స్నేహితుడు, సలహాదారుడు. చుట్టను నిదానంగా, ఓపికగా చుట్టసాగాడు. పొగాకు కింద పడిపోతున్నా అతడు లెక్కచెయ్యలేదు, ఆ క్షణంలో అతడు దేనినీ ఆదా చెయ్యటానికి ప్రయత్నించటంలేదు! ఆ క్షణంలో ఆలోచించాలని ఉంది అంతే. అయితే అతడి ఆలోచనలు అతడి మాట వినకుండా అన్ని వైపులకు పరుగులు తీస్తున్నాయి. వాటిన్నిటినీ పోగుచేసి, కాగితం మీద పొగాకు కాడలను పేర్చినట్టు ఒకదాని పక్కన ఒకటి పేర్చటానికి అతడు ప్రయత్నించాడు.

అతడు ఎన్నో విషయాల గురించి ఆలోచించాలనుకున్నాడు. అతడికి ఏమయ్యిందో – అన్నిటికంటే ముఖ్యంగా ఎందుకు అలా అయ్యిందో – తెలుసుకోవాలని అతడికి ఉంది. ఎవరిది తప్పో, ఎవరిది ఒప్పో తేల్చుకోవాలని ఉంది. ఆ తరువాత ఏం చెయ్యాలో, మరొక వంద ఎలా తేవాలో, రేపటికి తిండి ఎక్కడినుండి సంపాదించాలో నిర్ణయించుకోవాలని ఉంది. న్యాయం గెలిచినట్టు, తప్పుచేసినవాళ్లు, స్వార్థపరులు, దుష్టులు శిక్షింపబడినట్టు కలలు కనాలని ఉంది. అతడు సంతోషాన్ని, ఆనందాన్ని, ప్రశాంతతని, శాంతినీ కోరుకున్నాడు. ఇసుమంతైనా సరే, గౌరవాన్ని కోరుకున్నాడు.

అన్నిటికీ మించి అతడికి ఏడ్వాలని ఉంది. కానీ, యెగార్‌కి ఎలా ఏడ్వాలో తెలియదు. దాంతో విచారంగా చుట్ట కాలుస్తూ, బల్లవంక తేరిపార చూస్తూ కూర్చున్నాడు. చూపు మరల్చి, చుట్టూ పరికించేసరికి తలుపు వాకిట్లో నిలబడిన కోల్కా కనిపించాడు.

“అబ్బాయి... “ అంటూ లేచి నిలబడ్డాడు. తరువాత తలవంచుకున్నాడు. ఆపై మెల్లగా ఇలా చెప్పాడు, “నేను, అహ్, పందిని చంపాను, కొడుకా. అవును.”

“నాకు తెలుసు.”

కోల్కా లోపలికి వచ్చి వాళ్లమ్మ బల్లదగ్గర కూర్చునే ఎత్తుపీట మీద కూర్చున్నాడు. కానీ, యెగార్ నిలబడే ఉన్నాడు, అతడి తల సిగ్గుతో కిందకి దించే ఉంది.

"కూర్చో, నాన్నా."

యెగార్ మెల్లగా కుర్చీలోకి జారగిల్లాడు. చేతుల్లో ఉన్న చుట్టను కిటికీలోని కుండీలో నలిపేశాడు. అతడి కళ్లు నిలకడలేక కోల్కా చుట్టూ తిరిగాయి. కోల్కా తండ్రివైపు చూశాడు, అతడి చూపులు స్థిరంగా, పెద్దవాళ్ల చూపులకు మల్లే ఉన్నాయి. ఆ తరువాత, "అది నీ తప్పుకాదు, నాన్నా. నా తప్పు," అన్నాడు.

"నీ తప్పా? అలాగెందుకనుకుంటున్నావు?"

"నిన్ను నేను సరైన సమయంలో ఆపలేదు," కోల్కా నిట్టూర్చాడు. "ఒకసారి దాంట్లో పడిపోయిన తరువాత... "

"నిజమే చెప్పావు, కొడుకా."

"నిన్ను ఆపలేదు కాబట్టి, అది నా తప్పు. అలా బల్లవంక చూడటం ఆపెయ్యి, నాన్నా. ఇంతకు ముందు మాదిరి నావంక చూడు."

యెగార్ పెదవులు వణికాయి: అతడు నవ్వాలనుకుంటున్నాడో, ఈల వెయ్యాలనుకుంటున్నాడో అర్థం కాకుండా ఉంది. అతడు తనని తాను నియంత్రించుకోలేకపోతున్నాడు.

"నా తేట కన్నుల –"

"సరే, సరే," కోల్కా కోపంగా అంటూ ముఖం పక్కకి తిప్పుకున్నాడు. అతడు అలా చెయ్యటం మంచిదే అయ్యింది – ఉన్నట్టుండి యెగార్ ముక్కుపుటాలు అదిరి అతడి ప్రమేయం లేకుండానే రెండు కన్నీటి బిందువులు అతడి మాసిన గడ్డంమీద పడ్డాయి. వాటిని అతడు తుడిచేసుకుని, నవ్వుతూ మరొక చుట్ట చుట్టుకోసాగాడు. అతడు చుట్ట చుట్టి, వెలిగించేంతవరకు తండ్రీ, కొడుకులు ఇద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు. కోల్కా తండ్రివైపుకి తిరిగి, మెరుస్తున్న కళ్లతో, "సోనా యురీవ్నా ఇంటిలో ఒకతడి పాటలు విన్నాను, నాన్నా – ఏం గొంతుకనుకున్నావు! అచ్చం ఏనుగు మాదిరే!"

సాయంత్రం హారిటీనా పంది వేపుడు, పులుసు చేసి బల్లమీద సిద్ధంగా ఉంచింది. బల్ల దగ్గర శుభ్రమైన చొక్కా వేసుకుని యెగార్ కూర్చుని ఉన్నాడు: అతడికి ఎడమవైపున బహుమతులు ఉన్నాయి, కుడివైపున మద్యం సీసాలు ఉన్నాయి. అతిధులందరికీ అతడు బహుమతితోనూ, మద్యం గ్లాసుతోనూ స్వాగతం పలికాడు.

"మీ ఆరోగ్యానికి, అతిధులారా. తనివితీరా తాగండి, తినండి, బహుమతులను ఆస్వాదించండి."

బృంద నాయకులు, ఫోర్‌మాన్ రాలేదు, లేదా హారిటీనా వాళ్లు రావాలని అనుకోలేదేమో. అయితే, యకోవ్ ప్రొకొపిచ్ వచ్చాడు.

"నీ మీద నాకు ఎటువంటి కోపం లేదు, పొలుష్కిన్, అందుకే నేను వచ్చాను. కానీ, నేను చట్టాన్ని కూడా ఎంతో గౌరవిస్తాను. కాబట్టి, నీ పట్ల, చట్టంపట్ల నాకున్న గౌరవాన్ని చూపిస్తున్నాను. ఈ విషయంలో నా దృక్పధం ఇది."

"కూర్చో, యకోవ్ ప్రొకొపిచ్. మా వంట రుచి చూడు."

"సంతోషంగా. ప్రతిదానిని పాటించాలి కదూ? ప్రతిదీ పద్ధతి ప్రకారం ఉండాలి. పద్ధతిగా లేనిది కాల్పనికత అవుతుంది. కాల్పనికతను పెట్రోలు పోసి తగలపెట్టాలి."

ఫ్యొడార్ ఇపటొవిచ్ కూడా ఉన్నాడు. కానీ, అతడు తన విచారంలో ముడుచుకునిపోయి ఉన్నాడు. దాంతో అతడు తింటూ, తాగుతూ నిశ్శబ్దంగా ఉండిపోయాడు. కానీ, ఇప్పుడు యకోవ్ ప్రొకొపిచ్‌కి బదులిచ్చాడు: "ఎదుటివాడి ఇల్లు కాలుతూ ఉంటే ప్రతి ఒక్కడు తనకు సౌకర్యంగా ఉండేవిధంగా స్పందిస్తాడు. ఒకడు దానిని ఆర్పేస్తాడు, ఒకడు దానిని చూస్తూ ఉంటాడు, ఇంకొకడు చలి కాగుతూ ఉంటాడు."

యకోవ్ ప్రొకొపిచ్ అతడిమీద దాడికి దిగాడు: "నీ మాటల అర్థం ఏమిటి, ఫ్యొడార్ ఇపటొవిచ్?"

"కాల్పనికతను కాదు తగలబెట్టాల్సింది, అధికారానికి తలూపే సాంప్రదాయవాదులను తగలబెట్టాలి. వాళ్లందరినీ చుట్టబెట్టి, సన్నటి మంటపెట్టి కాల్చాలి."

మారిట్సా కల్పించుకోకుండా ఉంటే అది కాస్తా వాదనలోకి దిగి ఉండేదే. ఆమె భర్తని మెల్లగా పొడిచింది.

"గొడవ మొదలుపెట్టవద్దు. నీ పనేదో నువ్వు చూసుకో."

ఇంకొకవైపునుంచి ఓవా అందుకున్నాడు, "మనకి ఎప్పుడైనా పడవ అవసరం పడవచ్చు..."

అందరికీ బహుమతులు ఇస్తూ, ఓడ్కా పోస్తూ ఉన్న యెగార్ ఇదేమీ వినలేదు. అతడు తాగుతూ అందరి గ్లాసులలో మద్యం ఉందో లేదో చూస్తున్నాడు.

"తాగండి, ప్రియమైన అతిథులారా! ఫ్యోడార్ ఇపటొవిచ్, మా ప్రియమైన షడ్డకుడుగారూ, మూతి ముడుచుకుని, అలా బిగుసుకుపోయి కూర్చున్నావేమిటి, మిత్రమా? నవ్వు, నీ విలువైన మాటలు వినిపించు."

"మాటలే కదా? దానికేముంది," గ్లాసు పైకెత్తి అన్నాడు ఫ్యోడార్ ఇపటొవిచ్. "ఇది నువ్వు క్షేమంగా తిరిగి వచ్చినందుకు. నీ సమస్యను పరిష్కరించుకున్నందుకు. ఇక్కడ అందరూ అధికారానికి తల ఒగ్గేవాళ్లే కావటంతో పరిష్కారం కనుక్కోకపోతే బతకలేవు. నువ్వు దానినుంచి బయటపడ్డావు – చాలా మంచిది. ఇవే నా పొగడ్తలు. స్వర్గంవైపు చూస్తున్న పరిశుద్ధ ఆత్మవి నువ్వు."

"స్వర్గమా?" వగచింది హారిటీనా. "స్వర్గం ఇంకా ఎంతో దూరాన ఉంది. అక్కడికి చేరడానికి ఇంకొక వంద రూబుళ్లు కావాలి."

మారిట్సా ఆశ్చర్యపోయింది: "ఏమిటంటున్నావు, టీనా. ఇంకా వంద ఏమిటి? ఆ పందితో అప్పు తీరగా ఇంకొంత మిగిలి ఉండాలే..."

హారిటీనా అప్పటిదాకా తనను తాను ఎలాగో నియంత్రించుకుంది. పగలంతా అదే పని చేసింది కానీ ఇక తనవల్ల కాలేదు. చావు ఏడ్పు ఏడ్చినట్టు పెద్దపెట్టున ఏడ్చింది, "ఓ మారిట్సా, నా అక్కా, ఓ ఫ్యోడార్ ఇపటొవిచ్, బావగారూ, ఓ దయగల అతిధులారా... "

"ఏమయ్యింది, టీనా? ఒక్క క్షణం ఆ ఏడుపు ఆపు."

"మొత్తం పందికి రెం–డు వందల రూబుళ్లే."

"రెండు వందలేనా?" ఫ్యోడార్ ఇపటొవిచ్ చేతిలోని రొట్టెముక్క కూడా జారిపోయింది. "రెండు వందల రూబుళ్లేనా? అలాగెలా అమ్మావు? అంటే కిలోకి ఎంత పడింది?"

"ఎంత పడితే ఏముంది, వచ్చింది అంత," అన్నాడు యెగార్. "తినండి, తాగండి, ప్రియ–"

"ఒక్క నిమిషం ఆగండి!" ఫ్యొడార్ ఇపటొవిచ్ కోపంగా అడ్డుపడ్డాడు. "తాజా పంది మాంసమంటే ఏట మాంసం లాగా కాదు. ఈ సమయంలో, అదీ పట్టణంలో కిలోకి నాలుగు రూబుళ్ల చొప్పున అమ్ముడుపోతుంది! నాలుగు రూబుళ్లు – ఆ విషయం నాకు ఖచ్చితంగా తెలుసు."

బల్లచుట్టూ కూర్చున్న వాళ్లంతా గడ్డకట్టుకుపోయినట్టు అయ్యారు. "నా భార్య కూడా అదే ధర చెప్పింది," యకోవ్ ప్రొకొపిచ్ కూడా జోడించాడు.

"ఓ దేవుడా!" హారిటీనా రొదపెట్టింది. "ఏమి చేతును, పెద్దమనుషులారా!"

"ఆగండి!" ఆశ్చర్యంలో తన ఇంటి దగ్గర లేనన్న విషయం మరిచిపోయి ఫ్యొడార్ ఇపటొవిచ్ బల్లమీద చరిచి అరిచాడు. "అంటే నువ్వు రెండు వందల రూబుళ్లకు మోసపోయావు, యెగార్. అప్పులో ఉండి, పేదరికంలో ఉండి, పోషించాల్సిన కుటుంబం ఉండి రెండు వందల రూబుళ్లు దారినపోయే దానయ్య చేతిలో పోశావా? నీ అంతటి అసమర్థుడు ఉండడు!"

యెగార్ తన పిడికిలితో బల్లమీద కొట్టిన దెబ్బకి గ్లాసులన్నీ ఎగిరిపడ్డాయి.

"ఎవ్వరూ మాట్లాడకండి! మీరు ప్రతిదీ లెక్కిస్తారు కదూ? లాభాలను కూడి, నష్టాలను తీసేస్తారు కదూ? నా ఇంటిలో ఎవ్వరూ గణించటానికీ, తీసెయ్యటానికి లేదు, తెలిసిందా? నేను ఈ ఇంటి యజమానిని. నేను లెక్కించగలిగింది ఒక్కటే: ఎవరికి ఇల్లు కావాలి, ఎవరికి ఇంటికప్పు బాగుచెయ్యాలి, ఎవరికి కిటికీ తయారు చెయ్యాలి – ఇవే నేను లెక్కపెట్టేది. జీవితంలో వీటినే లెక్కపెట్టాలని నా కొడుకును కూడా ఆదేశిస్తున్నాను. నాకు మూడు వంతుల భూమి ఉంది, ఆ మూడు వంతులు నా నియమాల ప్రకారం జీవించి, నేను లెక్కించినవే లెక్కించాలి. నా నియమాలు చాలా సులువైనవి: రూబుళ్లను లెక్కపెట్టవద్దు – పాటలను లెక్కపెట్టండి. అందరికీ స్పష్టమయ్యిందా? అయితే, హారిటీనా, ఒక పాట పాడు. పాడమని నిన్ను ఆదేశిస్తున్నాను."

అందరూ నివ్వెరపోయి, నిశ్శబ్దంగా కూర్చున్నారు. అందరూ నోళ్లు తెరుచుకుని యెగార్ వంక చూస్తూ ఉండిపోయారు. ఇదంతా కోల్కాకి చాలా తమాషాగా అనిపించసాగింది: తనివితీరా నవ్వుకోటానికి అతడు బల్ల దగ్గరనుంచి పరిగెత్తి పెరటిలోకి వెళ్లాడు.

"పాడు, టీనా," అన్నాడు యెగార్. "ఒక మంచి పాట పాడు."

హారిటీనా ఇబ్బందిగా కదిలింది. చెంపకి చెయ్యి ఆనించుకుని, గొంతు సవరించుకుని పాడటం మొదలుపెట్టింది... కానీ మరొకసారి ఆమె అదే ఏడుపు పాట ఎత్తుకుంది:

అయ్యో, అయ్యో, అయ్యో.

నా కష్టాలు ఏమి చెప్పుదునయ్యా!

చినదానను, చక్కనిదాననయ్యా,

ఎవరు గట్టెక్కింతురయ్యా...

*(తరువాయి భాగం వచ్చేవారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com